
సాక్షి
చిత్తూరు
బుధవారం । 3 । మే । 2023



కమనీయం.. కోనేటిరాయుని కల్యాణం

గంగవరం : కీలపట్లలోని కోనేటిరాయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.

- 8లో..



అందరి కృషితో అరుదైన గౌరవం

నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు రావడంతో మంగళవారం కాలేజీ ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు.

-8లో..

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	24
తిరుపతి	33	26
తిరుమల	28	21
గూడూరు	33	27
నగరి	33	26

న్యూస్‌రీల్

త్వరలో ఏఎన్‌ఎంలకు వేతన బకాయిలు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఏఎన్‌ఎంలకు రెండు నెలలపాటు వేతనాలు అందలేదు. సాంకేతిక కారణాల వల్ల తలెత్తిన సమస్యను ప్రభుత్వం దృష్టికి యూనియన్ నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం కేంద్ర శాఖ అధికారులతో మాట్లాడి ఏఎన్‌ఎం వేతనాల మంజూరుకు చర్యలు చేపట్టింది. దీంతో ఈనెల 6 వ తేదీ తర్వాత వేతనాలు వారి ఖాతాలో జమకానున్నట్లు తెలిసింది.

టీ20 క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక రేపు

సోమల: స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం ఉదయం 10 గంటలకు టీ20 క్రికెట్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి అశ్విందర్ సింగ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సునైల్ కుమార్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ రూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండర్- 19, సీనియర్స్ విభాగాల్లో జట్లను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9701515415 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇన్‌చార్జి డీఈఓగా చంద్రశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు రెండు రోజులపాటు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు పెట్టారు. ఈ మేరకు ఇన్‌చార్జి డీఈఓగా చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ వ్యవహరించనున్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా చేరేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. తొలివిడతలో 25 శాతం సీట్లు భర్తీ కాకపోవడంతో రెండో విడతకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 6 నుంచి 15వ తేదీలోపు www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎంపికలు పూర్తి చేసి విద్యార్థులకు పాఠశాలను కేటాయించనున్నట్లు వివరించారు.

విజయ డెయిరీ పునఃప్రారంభానికి చర్యలు



ముళ్లకంపలు తొలగిస్తున్న జేసీబీ

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు విజయ డెయిరీని పునఃప్రారంభించేందుకు చర్యలను అధికారులు చేపట్టారు. రెండు రోజులుగా డెయిరీ ఆవరణలోని పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు, చెట్లను తొలగిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు త్వరలోనే విజయా డెయిరీని సిద్ధం చేసి అమూల్ సంస్థకు అప్పగించనున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు.

ప్రతి పంచాయతీలో 'అమృత్ సరోవర్'



మాట్లాడుతున్న చిన్నతాతయ్య

పుత్తూరు రూరల్: జిల్లాలోని ప్రతి పంచాయతీలో అమృత్ సరోవర్ పథకం కింద ఓ చెరువును అభివృద్ధి చేయాలని ఉపాధి హామీ స్టేట్ డైరెక్టర్ చిన్నతాతయ్య ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల పీడీలతో కలిసి ఉపాధి పనులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఓలు, ఈసీ, జేఈలు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలోని పేదలు ఉపాధి పనికి వచ్చేలా అవగాహన కల్పించాలని కోరారు. కూలీల ఖాతాల్లో వేతనాలు సక్రమంగా జమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విశ్వనాథం, డ్వామా పీడీలు గంగా భవానీ, శ్రీనివాసప్రసాద్, ఏపీడీలు సరిత, శోభన్‌బాబు పాల్గొన్నారు.



విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన పథకాలతో విశేషంగా కృషి చేస్తోంది. నాడు–నేడు కింద సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతోంది. సరికొత్తగా ప్రవేశపెట్టిన సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం సైతం చేయూతనందించేందుకు ముందుకు వచ్చింది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం ద్వారా ఎంపిక చేసిన పాఠశాలలకు అదనపు నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోంది. అలాగే నూతన విద్యా విధానంలో భాగంగా ఐదేళ్లపాటు ఆయా బడులకు ఆర్థిక.. సాంకేతిక సహకారం అందించేలా ప్రణాళిక రూపొందించింది.

మరింతగా మెరుగు 'బడి'



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన నగరిలోని ఎం.కొత్తూరు పాఠశాల

- నాడు–నేడుకు తోడుగా పీఎంశ్రీ
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం
- ఉమ్మడి జిల్లాలో 44 స్కూళ్ల ఎంపిక
- అదనపు నిధులతో ఉన్నతంగా వసతులు

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నాడు–నేడు పథకం కింద సర్కారు బడులను దశలవారీగా ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా కార్పొరేట్ స్థాయి వసతులను కల్పిస్తోంది. జాతీయ స్థాయి పోటీకి తగ్గట్టుగా నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తోంది. విద్యా ప్రమాణాలను మరింత పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు కేంద్ర ప్రభుత్వం సైతం సహకారం అందిస్తోంది. ''ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' పథకం కింద రాష్ట్రంలోని పలు పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలలకు ఐదేళ్ల వరకు ఆర్థికంగా, సాంకేతికంగా అండదండలందించనుంది.

అదనపు వసతులు

ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మరింతగా మారనున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నే రీతిలో అభివృద్ధి చెందనున్నాయి.నాడు–నేడుకు తోడుగా పీఎంశ్రీ పథకం తోడు కావడంతో అదనపు వసతులు సమకూరనున్నాయి. ఈ మేరకు పీఎంశ్రీ పథకానికి చిత్తూరు జిల్లాలో 21, తిరుపతి జిల్లాలో 23 పాఠశాలలు ఎంపికయ్యాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు

మండలం	పాఠశాల	మండలం	పాఠశాల
బంగారుపాళెం	జీహెచ్‌ఎస్, బంగారుపాళెం	బుచ్చినాయుడు కండ్రిగ	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ
చిత్తూరు	ఎంపీపీఎస్, తుమ్మింద	చంద్రగిరి	జెడ్పీహెచ్‌ఎస్, చంద్రగిరి (బాలికలు)
చిత్తూరు అర్బన్	ఎంహెచ్‌ఎస్, గిరింపేట	చిల్లకూరు	జెడ్పీహెచ్‌ఎస్, వరగలి
గంగాధర నెల్లూరు	జెడ్పీహెచ్‌ఎస్, నీలపల్లె	చిన్నగొట్టిగల్లు	జెడ్పీహెచ్‌ఎస్, చిన్నగొట్టిగల్లు
గంగవరం	జెడ్పీహెచ్‌ఎస్, గంగవరం	చిట్టమూరు	జెడ్పీహెచ్‌ఎస్, మెట్టు
గుడిపాల	జెడ్పీహెచ్‌ఎస్, నరహరిపేట	డక్కిలి	జెడ్పీహెచ్‌ఎస్, డక్కిలి
గుడిపల్లె	జెడ్పీహెచ్‌ఎస్, శెట్టిపల్లె	దొరవారిసత్రం	మోడల్ స్కూల్, మావిలపాడు
కార్వేటినగరం	జెడ్పీహెచ్‌ఎస్, కత్తెరపల్లె	కేవీబీపురం	ఏపీఎంఎస్, కేవీబీపురం
నగరి	జెడ్పీహెచ్‌ఎస్, ఎం.కొత్తూరు	కోట	ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, చిట్టేడు
పలమనేరు	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పలమనేరు (బాలికలు)	నాగలాపురం	జెడ్పీహెచ్‌ఎస్, బీరకుప్పం
		నారాయణవనం	జెడ్పీహెచ్‌ఎస్, పాలమంగళం
		ఓజిలి	ఏపీఆర్ఎస్, చిల్లమంచేను
పెదపాంజాణి	కేవీసీఆర్ జెడ్పీహెచ్‌ఎస్, రాయలపేట	పాకాల	జెడ్పీహెచ్‌ఎస్, దామలచెరువు
పెనుమూరు	జెడ్పీహెచ్‌ఎస్, పెనుమూరు	పిచ్చాటూరు	జెడ్పీహెచ్‌ఎస్, పిచ్చాటూరు
పుంగనూరు	ఏపీఎంఎస్, తూనిగుంట	రేణిగుంట	జెడ్పీహెచ్‌ఎస్, రేణిగుంట (బాలికలు)
పూతలపట్టు	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పూతలపట్టు (బాలురు)	సత్యవేడు	ఎంజేపీఏపీ, సత్యవేడు
		శ్రీకాళహస్తి	జెడ్పీహెచ్‌ఎస్, తొండమనాడు
రొంపిచర్ల	జెడ్పీహెచ్‌ఎస్, రొంపిచర్ల (బాలురు)	తడ	ఏపీఎంఎస్, తడ
శాంతిపురం	జీహెచ్‌ఎస్, శాంతిపురం	తిరుపతి రూరల్	జెడ్పీహెచ్‌ఎస్, తిరుచానూరు
శ్రీరంగరాజాపురం	జెడ్పీహెచ్‌ఎస్, కొత్తపల్లెమిట్ట	వడమాలపేట	జెడ్పీహెచ్‌ఎస్, వడమాలపేట (బాలురు)
తవణంపల్లె	జెడ్పీహెచ్‌ఎస్, తవణంపల్లె		
వెదురుకుప్పం	జెడ్పీహెచ్‌ఎస్, వెదురుకుప్పం	వరదయ్యపాళెం	జెడ్పీహెచ్‌ఎస్, వరదయ్యపాళెం
విజయపురం	జెడ్పీహెచ్‌ఎస్, పన్నూరు	ఏర్పేడు	జెడ్పీహెచ్‌ఎస్, పాళెం
యాదమరి	జెడ్పీహెచ్‌ఎస్, యాదమరి	ఏర్రావారిపాళెం	ఏపీఎంఎస్, ఏర్రావారిపాళెం

మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ

- పీఎంశ్రీ పథకానికి పాఠశాలలను మూడు అంచెల్లో ఎంపిక చేస్తారు.
- నిర్దేశిత ఫార్మెట్‌లో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ముందు దరఖాస్తు చేసుకోవాలి.
- కేంద్రా విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన దరఖాస్తులను తనిఖీ చేస్తారు.
- నిపుణుల కమిటీ ద్వారా నిబంధనలకు అనుగుణంగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేస్తారు.
- 2021–22 విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ఆయా పాఠశాలలను ఎంపిక చేశారు.

ప్రయోజనాలు..

- పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయిస్తుంది.
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలను కల్పిస్తుంది.
- ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుంది.
- విడతల వారీగా మంజూరయ్యే నిధులతో విద్యార్థులకు అవసరమైన పరికరాలను సమకూర్చుకునే వెసులుబాటు ఇస్తుంది.
- పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడా సామగ్రి తదితర వసతులను కల్పిస్తుంది.
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపు, ఫలితాల సాధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది

శుభ పరిణామం



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుంది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. విద్యారంగం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నాయి. ఇది శుభపరిణామం. – విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ఉత్తమ ఫలితాలకు అవకాశం



నాడు– నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అందంగా రూపుదిద్దుకున్నాయి. విద్యా విధానంలో పలు మార్పులు చోటు వచ్చాయి. నేడు పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు మరిన్ని వసతులు సమకూరనున్నాయి. బోధనా విధానంలోనూ మార్పులు తీసుకొస్తున్నారు.
– రఘురామయ్య, డిప్యూటీ డీఈఓ, పుత్తూరు

నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయం



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో మంత్రి రోజా

పుత్తూరు రూరల్: నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖా మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. మంగళవారం స్థానిక పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందిన 50 మంది విద్యార్థులకు నియమాకపత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ నవమాసాలు మోసి ప్రసవించిన తర్వాత బిడ్డను చూసి తల్లి ఎంతగా సంతోషిస్తుందో, పాలిటెక్నిక్‌ను ప్రారంభించినప్పుడు అదే అనుభూతికి లోనయ్యానన్నారు. ఈ కళాశాల తనకు తొలి బిడ్డ వంటిదని తెలిపారు. ఒక ఆశయంతో రాజకీయాల్లోకి ప్రవేశించానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో దాన్ని సాధిస్తున్నానని వెల్లడించారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా జగనన్న చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులకు రూ.1.5లక్షల నుంచి రూ.2.6లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు వస్తున్నాయంటే స్కిల్ హబ్‌ల ద్వారా ఇస్తున్న శిక్షణ ఎంత సమర్థవంతంగా ఉందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్‌ను అడ్డు పెట్టుకుని డొల్ల కంపెనీల పేరిట చంద్రబాబు దాదాపు రూ.373 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్‌పై సీఐడీతోపాటు ఈడీ కూడా విచారణ చేపట్టిందని వెల్లడించారు. డిజైన్ టెక్ సంస్థకు చెందిన రూ.30 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసిందని తెలిపారు. పారదర్శక పాలనలో జగనన్నకు చంద్రబాబుకు వ్యత్యాసాన్ని గమనించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 6లక్షలకు పైగా ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అలాగే 1.60లక్షల సచివాలయ, 4వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చినట్లు వివరించారు. ఆర్టీసీలోని 50వేల మంది ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినట్లు వెల్లడించారు.

ఈ క్రమంలోనే నిరుద్యోగ సమస్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రైవేటు రంగంలోనూ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అందుకోసం పెద్దసంఖ్యలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఉన్నత భవిష్యత్ కోసం ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోందని చెప్పారు. జగన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజి రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత చదువులతో పాటు విదేశీ విద్యకు సైతం తోడ్పాటును అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎస్‌వీ కుమార్, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయ ప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహిన్ పాల్గొన్నారు.

సమీపిస్తున్న సుమూహూర్తం

- మూడోవారంలో సామూహిక గృహప్రవేశాలు
- 10లోపు బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

సాక్షి, చిత్తూరు : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఈ నెల మూడో వారంలో సామూహిక గృహప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా పకడ్బందీగా పనిచేయాలని స్పష్టం చేశారు. మండలాల వారీగా గృహనిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు. ఆయా కాలనీల్లో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఆర్‌ఎల్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని, ఇప్పటి వరకు పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే నిర్మాణం మొదలుపెట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెలాఖరుకు అన్ని ఇళ్ల గ్రౌండింగ్ అయ్యేలా హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిలో వెనుకబడిన మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని స్పష్టం చేశారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 10వ తేదీలోపు ఇళ్లకు సంబంధించిన అన్ని బిల్లులను అప్‌లోడ్ చేయాలని కోరారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ పద్మనాభం పాల్గొన్నారు.

సరిహద్దుల్లో కట్టుదిట్టంగా నిఘా



ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి

చిత్తూరు అర్బన్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల వద్ద కట్టుదిట్టంగా నిఘా పెట్టినట్లు ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి తెలిపారు., మంగళవారం చిత్తూరులో ఆమె మీడియాతో మాట్లాడారు. నంగిలి, రామకుప్పం, పలమనేరు, వి.కోటతో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నిఘా పెంచడంతో పాటు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని, 5 ప్రత్యేక పోలీసు బృందాలతో గస్తీ చేపట్టినట్లు వెల్లడించారు. అక్రమ మద్యం, ఎర్రచందనం, ఐపీఎల్ బెట్టింగులు తదితర అసాంఘిక కార్యకలాపాలపై డయల్–100, పోలీసు వాట్సాప్–9440900005, ఎస్ఈబీ టోల్ ఫ్రీ–14500 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

భత్యం.. హర్షం

- ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ పెంపు
- ఇచ్చిన మాట నెరవేర్చిన ప్రభుత్వం
- కొత్త జీవో అమలుకు ట్రెజరీశాఖ సన్నాహాలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సర్కారు తీపి కబురు అందించింది. కరువు భత్యం (డీఏ) పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను 2.73 శాతం మంజూరు చేసింది. పెంచిన డీఏ ప్రకారం కసరత్తు నిర్వహించి జూలై 1 నుంచి ఉద్యోగులకు, పెన్షనర్లకు అందజేసేందుకు చర్యలు చేపట్టింది.

22.75 శాతానికి పెంపు

ప్రభుత్వం జీరీ చేసినన జీఓ నంబర్ 66, 67 మేరకు ఉద్యోగుల, పెన్షనర్ల మొత్తం డీఏ 20.2శాతం నుంచి 22.75 శాతానికి చేరింది. అలాగే ఉద్యోగ విరమణ చేసినవారికి పెంచిన డీఏ బకాయిలను వారి బెనిఫిట్స్‌లో కలిపి చెల్లించనున్నారు. డీఏ పెంపు జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సమితి, 2022లో సవరించిన రెగ్యులర్ స్కేళ్లు పొందుతున్న వర్క్ చార్జ్‌డ్, ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎయిడెడ్ పాలిటెక్నిక్, యూనివర్సిటీ సిబ్బంది, ఉద్యోగులందరికీ కొత్త జీవో వర్తిస్తుందని ట్రెజరీ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమాచారం


	చిత్తూరు జిల్లా	తిరుపతిజిల్లా
ఉద్యోగులు	21,923	22,454
పెన్షనర్లు	12,845	14,245

సంతోషంగా ఉంది




రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు డీఏ పెంచుతూ జీఓ విడుదల చేయడం సంతోషంగా ఉంది. దీంతో మాకు 2.73 శాతం డీఏ పెరిగింది. ఈ జీఓ కారణంగా విశ్రాంత ఉద్యోగులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇచ్చిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– కేశవులు, విశ్రాంత ఉద్యోగి.

శుభపరిణామం....



డీఏ పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేయడం శుభపరిణామం. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సానుకూలంగా స్వాగతిస్తున్నాం. ఉద్యోగ సంఘం నాయకులు అడిగిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.
– ప్రకాష్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు, చిత్తూరు.

హర్షణీయం



ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏ పెరగనుంది. డీఏ 2.73 శాతం పెంచడం హర్షణీయం. ఉద్యోగుల బేసిక్ పే ప్రకారం పెరిగిన డీఏను అమలు చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగ సంఘం నాయకులతో ప్రభుత్వం చర్చించి ఆ మేరకు సానుకూల నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.
– బాలాజీ, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ఉద్యోగులకు మేలు



ప్రభుత్వం జారీ చేసిన డీఏ ఉత్తర్వులతో ఉద్యోగులందరికీ మేలు చేకూరుతోంది. టీచర్లు, ఇతర శాఖల ఉద్యోగులకు మరింత ప్రయోజనం కలగనుంది. ఉద్యోగుల ఇబ్బందులను సానుకూలం ధోరణితో పరిశీలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – వినాయకం, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రభుత్వ మా ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. డీఏ పెంచుతూ జీఓ విడుదల చేయడం అభినందనీయం. డీఏ బకాయిలను సెప్టెంబర్, డిసెంబర్‌లో చెల్లిస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. కరువు భత్యాన్ని 22.75 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– విజయ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

క్లుప్తంగా

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పూతలపట్టు : మండలంలో పలు చోరీలకు పాల్పడిన కేసుల్లో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఆశీర్వాదం తెలిపారు. వివరాలు.. పులిచెర్ల మండలం మంగళంపేటకు చెందిన శేఖర్(36), కార్వేటినగరానికి చెందిన సుబ్రమణ్యం(40) వరుసగా చోరీలు చేశారు. పి.కొత్తకోట గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలతో పాటు, ఇతర వస్తువులను అపహరించారు. వావిల్‌తోట, ముత్తిరేవుల, నొచ్చుపల్లె, జెట్టిపల్లె, కొత్తకోటలో పలు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి సుమారు 30 కేజీల రాగి తీగలను చోరీ చేశారు. పి.కొత్తకోటలోని ఓ ఇంట్లో వెండి వస్తువులు, ఫ్యాన్, ఇత్తడి బిందెలు, గ్యాస్ సిలిండర్లు తదితర సామగ్రిని దోచుకువెళ్లారు. వీటిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి, ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రూ.3లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ హరిప్రసాద్, సిబ్బందిని సీఐ అభినందించారు.

పెట్రోల్ దాడిలో గాయపడిన మహిళ మృతి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): పెట్రోల్ దాడికి గురైన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. వివరాలు.. మండలంలోని బోనుపల్లి దళితవాడకు చెందిన ఆదిలక్ష్మిపై ఆమె భర్త గత నెల 24వ తేదీన పెట్రోల్ పోసి తగలబెట్టిన విషయం తెల్సిందే. అప్పటి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. సీఐ విక్రమ్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ రాఘవేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. కోనేటిరాయుని కల్యాణం



గరుడునిపై ఊరేగితున్న శ్రీవారు



కోనేటిరాయస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గంగవరం : మండలంలోని కీలపట్లలో ఉన్న శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఐదోరోజు మంగళవారం శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ముందుగా ఉదయం అభయప్రదాత స్వరూపుడైన శ్రీనివాసుడు జగన్మోహినిగా దర్శనమిచ్చారు. తిరుచ్చిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చెక్క భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా ఊరేగారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని ఆలయ ఆస్థానమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై వేంచేపు చేశారు. వేద మంత్రోచ్చారణల, గోవింద నామ స్మరణల మధ్య రమణీయంగా దేవదేవేరుల కల్యాణం జరిపించారు. టికెట్ కొనుగోలు చేసిన భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవంలో పాల్గొన్నారు. రాత్రి సర్వాలంకారభూషితుడైన కోనేటిరాయస్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడుని అధిరోహించారు. అశేష భక్తజనం నడుమ మాడవీధుల్లో విహరించారు. వైకుంఠనాథుని దివ్యతేజాన్ని వీక్షించిన భక్తులు పులకించారు. హిందూ ధర్మపరిషత్ కళాకారులు గీతాలాపనతో అలరించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హనుమంత వాహనసేవ, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజవాహన సేవ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, కంకణంభట్ర భాస్కరాచార్యులు, దేవరాజాచార్యులు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గిరిరాజారెడ్డి, స్థానిక నేత రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడి అరెస్ట్

సోమల: మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఇన్చార్జి ఎస్‌ఐ మారుతి మంగళవారం తెలిపారు. మండలంలోని ఆవులపల్లె పంచాయతీలో ఓ బాలికపై సుబ్రమణ్యం లైంగిక వేధింపులకు పాల్పడటంతో కేసు నమోదు చేశామన్నారు. స్థానిక బస్టాండు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79

అందరి కృషితో అరుదైన గౌరవం



కళాశాల వద్ద అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి

- నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గుర్తింపు
- జిల్లాలో తొలి కాలేజీ.. రాష్ట్రంలో రెండోస్థానం

నగరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిలర్ (నాక్) ఏ ప్లస్ గుర్తింపును ఇచ్చిందని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని నాక్ సంస్థ ప్రధాన కార్యాలయం ఈ మేరకు సోమవారం సాయంత్రం ప్రకటించిందని వెల్లడించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది.. ఇలా అందరి కృషితోనే అరుదైన గౌరవం దక్కిందన్నారు. ఇటీవల రెండురోజుల పాటు కళాశాలను నాక్ బృందం సందర్శించిందని, వివిధ విభాగాల పనితీరును పరిశీలించిందని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో సమావేశమై కళాశాల పనితీరును ఆరా తీసిందని చెప్పారు. సదరు బృందం జరిపిన థర్డ్ సైకిల్ ఆడిట్‌లో కాలేజీకి 3.28 క్యుమిలేటివ్ గ్రేడ్ పాయింట్లు రావడంతో ఏ ప్లస్ గుర్తింపును ప్రకటించారని తెలిపారు. జిల్లాలో ఏ ప్లస్ గుర్తింపు పొందిన తొలి కళాశాలగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని మొత్తం 166 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో రాజమండ్రి కళాశాలకు మాత్రమే ఏ ప్లస్ గుర్తింపు ఉండేదని, ఇప్పుడు నగరి కాలేజీ రెండోదిగా సుస్థిర స్థానం సంపాదించుకుందని వెల్లడించారు. ఇక్కడ అమలు చేస్తున్న అకడమిక్ ఆడిట్, సర్టిఫికెట్ కోర్సులు, రెమిడియల్ కోచింగ్, నక్షత్రవనం తదితర అంశాలను తమ సంస్థల్లో కూడా ప్రవేశపెడతామని నాక్ బృందం చెప్పడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ ఘనతకు సహకరించిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని ఆయన సత్కరించారు.

బాధిత కుటుంబానికి ఓదార్పు



మృతుల కుటుంబానికి చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): మండలంలోని ఎర్రమట్టిపల్లెలో సోమవారం ఈతకు వెళ్లి మృతి చెందిన తండ్రీకొడుకులు సెల్వరాజ్, ధనుష్ భౌతికకాయాలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి మంగళవారం నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సెల్వరాజ్ తనకు సుపరిచితుడని వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా విశేష సేవలందిచారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని, ఇద్దరు కుమార్తెలను చదివించేందుకు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 7 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును సెల్వరాజ్ భార్య శోకమ్మకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు దూది మోహన్, మధుసూదన్ రెడ్డి, చెంగల్రాయులు, హరికృష్ణ పాల్గొన్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సెల్వరాజ్, ధనుష్ అంత్యక్రియలను అశ్రునయనాల నడుమ నిర్వహించారు. తండ్రీకొడుకుల మృతదేహాలను చివరి చూపు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.

కారు బోల్తా : వృద్ధురాలి మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు

గంగవరం : మండలంలోని మన్నారునాయనిపల్లె వద్ద మంగళవారం ఓ కారు బోల్తా పడడంతో వృద్ధురాలు మృతి చెందారు. వివరాలు.. బెంగళూరు శాటిలైట్ ఏరియాకు చెందిన శేషప్ప తన కుటుంబంతో కలిసి రెండు రోజుల క్రితం కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. తిరుగుప్రయాణంలో తిరుత్తణికి వెళ్లి, అక్కడ నుంచి బెంగళూరు చేరుకునేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో గంగవరం బైపాస్‌రోడ్డులోని మన్నారునాయని పల్లె వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న బోర్డును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శేషప్ప భార్య జయలక్ష్మి(63) అక్కడికక్కడే మరణించారు. కారు నడుపుతున్న దివాకర్(45), భార్య వేదవతి(37), శేషప్ప(70) స్వల్పంగా గాయపడ్డారు. పిల్లలు ప్రార్థన, మనీష్ సురక్షితంగా బయటపడ్డారు. కారు పూర్తిగా ధ్వంసమైంది. హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తి హత్య

- వివాహేతర సంబంధమే కారణం



నిందితుడు నవీన్

శ్రీరంగరాజపురం : మండలంలోని ఉద్దండ మహారాజపురంలో వివాహేతర సంబంధం కారణంగా ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివరాలు.. వి.కోటకు చెందిన నవీన్, పలమనేరుకు చెందిన కీర్తనను వివాహం చేసుకున్నాడు. మనస్పర్థల కారణంగా రెండేళ్ల క్రితం వారు విడిపోయారు. ఈ క్రమంలో మహేంద్ర అనే వ్యక్తి కీర్తనతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి ఆటోలో పాత సామన్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నవీన్ కోపంతో రగిలిపోయాడు. తమ్ముడు సురేష్‌తో కలిసి సోమవారం రాత్రి కీర్తన, మహేంద్ర నిద్రపోతుండగా వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో కీర్తన స్వల్పంగా గాయపడగా, మహేంద్రకు తీవ్రమైన గాయాలయ్యాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మంగళవారం మరణించాడు. నిందితుడు నవీన్ వెంటనే పోలీసులకు లొంగిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి ఘర్షణ : ఒకరి మృతి



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు(ఇన్‌సెట్) రాముడు మృతదేహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు– బెంగళూరు జాతీయ రహదారి పనులకు వచ్చిన ఇద్దరు కూలీలు మధ్య సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. మంగళవారం చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మద్దయ్య ఆచారి, ఎస్‌ఐ ప్రసాద్ వివరాలను మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన రాముడు (30), కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన వీరేష్ (31) రోడ్డు పనులకు వచ్చారు. రాత్రి భోజనం చేసే సమయంలో ఇద్దరికీ చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో రాముడు కర్రతో వీరేష్‌ను కొట్టాడు. కోపం పట్టలేని వీరేష్ మరో కర్రతో ఎదురుదాడికి దిగాడు. తలపై తీవ్రంగా కొట్టడంతో రాముడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో హైవేపై నడుచుకుంటూ వెళుతున్న వీరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాముడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- మామిడి పండ్ల పక్వానికి కాల్షియం కార్బైట్ వాడకూడదు
- కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజారోగ్యం దృష్ట్యా మామిడి పండ్ల పక్వానికి కాల్షియం కార్బైట్ వినియోగంపై నిషేధం విధించినట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి మార్కెట్లు, గోదాములు నిర్వహించే ట్రేడర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో గోదాములను పర్యవేక్షించాలని, పకడ్బందీగా నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. అలాగే ట్రేడర్ల విన్నపం మేరకు చిత్తూరు మామిడి మార్కెట్ యార్డ్ లోపలకి వర్షపు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఇందుమతి, డీపీఓ లక్ష్మి, జిల్లా రవాణా శాఖ అధికారి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఉపాధి’ లక్ష్యాలను అధిగమించాలి

ఉపాధి హామీ పనుల్లో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ ఆదేశించారు. దళిత, గిరిజనులకు పని కల్పించేందుకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 13లక్షల పనిదినాలను అమలు చేయాలన్నారు. సామాజిక పింఛన్లను తొలి రెండు రోజుల్లోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఫేషియల్ అథెంటికేషన్ ద్వారా పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. చేయూత పథకం ద్వారా తీసుకున్న సొమ్మును లబ్ధిదారులు వినియోగించుకున్న తీరును పరిశీలించాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ గంగాభవాని, డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

ఔరా..అల్లూరయ్యా!

శ్రీకాళహస్తి మున్సిపల్ ఉద్యోగి చేతివాటం

- రాజీవ్‌నగర్‌లో ప్లాట్ల విక్రయం
- సిమెంటు, స్టీలు కోసం లబ్ధిదారుల నుంచి పట్టాల సేకరణ
- ఎంతకీ పట్టాలు ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యేకు ఫిర్యాదు
- అధికారుల సోదాలో ఉద్యోగి ఇంట్లో వందల సంఖ్యలో పట్టాలు



సోదాలు చేస్తున్న అధికారులు (ఇన్‌సెట్) అల్లూరయ్య



అల్లూరయ్య నూతనంగా నిర్మించిన భవనం

సాక్షి, తిరుపతి/శ్రీకాళహస్తి : కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ఇళ్ల స్థలాలను విక్రయించి సొమ్ముచేసుకుంటున్న మున్సిపల్ ఉద్యోగి బాగోతం బట్టబయలైంది. శ్రీకాళహస్తి మున్సిపల్ ఉద్యోగి అల్లూరయ్య నివాసంలో మంగళవారం రెవెన్యూ, పోలీసులు, మున్సిపల్ అధికారులు సోదాలు చేయగా వందల సంఖ్యలో ఇంటి పట్టాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అల్లూరయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాలు.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీకాళహస్తి సమీపంలో ఆరు వేల మందికి రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీచేశారు. దానికి రాజీవ్‌నగర్ అని నామకరణం చేశారు. లబ్ధిదారులకు పక్కాగృహాలు మంజూరు చేసి.. మూడు విడతల్లో రెండువేల చొప్పున పక్కాగృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో హౌసింగ్‌లో అల్లూరయ్య కాంట్రాక్టు ఉద్యోగి. పక్కాగృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం సిమెంటు, కమ్మీ లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వగా.. అందు కోసం లబ్ధిదారులు ఇంటిపట్టా, రేషన్ కార్డు హౌసింగ్ అధికారులకు చూపించాల్సి వచ్చేది. ఆ సమయంలో అల్లూరయ్య ఆ పట్టాలను తన వద్దే ఉంచుకున్నాడు. వాటిని ఒక్కొక్కటిగా విక్రయించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. తర్వాత అతనిపై ఆరోపణలు రావడంతో ఉద్యోగం నుంచి తొలగించారు.

టీడీపీ నేతల సహకారంతో మున్సిపాలిటీలోకి

సస్పెండ్ అయిన అల్లూరయ్య తండ్రి శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో పనిచేసేవాడు. ఆయన తదనంతరం ఉద్యోగం కోసం అల్లూరయ్య టీడీపీ నేతలను ఆశ్రయించాడు. టీడీపీ నేతల సహకారంతో మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. టీడీపీ నాయకుల సహకారంతో ప్లాట్ల విక్రయానికి తెరతీశాడు. నాడు రూ.30 వేలు విలువ ఉన్న ఒక ప్లాటు ప్రస్తుతం రూ.5 లక్షలకుపైనే విక్రయించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు అల్లూరయ్యను పట్టాలడగగా.. తనవద్ద లేవని తిప్పిపంపేవారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆశ్రయించడంతో ఆయన అధికారులను పిలిచి విచారించమని ఆదేశించారు. తహసీల్దార్ రూప్ చంద్, సుధీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్, శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ మల్లికార్జున సిబ్బందితో కలిసి అల్లూరయ్య నివాసంలో సోదాలు చేయగా వందల సంఖ్యలో పట్టాలు బయటపడ్డాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని అల్లూరయ్యని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

> **పేదలను మోసంచేస్తే సహించేది లేదు**
>
> ప్రజలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదు. వారిపై కఠిన చర్యలు తప్పవు. నాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలన్నది వారి కల. అందు కోసం ప్రభుత్వమే భూములు కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా పక్కాగృహాలు కట్టించి ఇస్తోంది. అటువంటి వాటిలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు.
>
> – బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాళహస్తి